క్లుప్తంగా

సభకు తరలిన పంచాయతీ సిబ్బంది

జఫర్‌గఢ్: గ్రామ పంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన పాదయాత్ర ముగింపు సభకు మండలంలోని జీపీ సిబ్బంది వాహనాల్లో మంగళవారం తరలివెళ్లారు. సంఘం నాయకులు ఠాకూర్ వివేక్ సింగ్, సాకి నర్సింగం, రేణుక, సులోచన, మనీల, లక్ష్మి, రామస్వామి ఉన్నారు.

విద్యార్థికి అభినందనలు



దేవరుప్పుల: జాతీయ కరాటే చాంపియన్‌షిప్–2023 సిల్వర్ జూబ్లీ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో దేవరుప్పుల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి గుగులోత్ శ్రీజ గోల్డ్ మెడల్‌ను సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం శ్రీజతో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన బానోత్ బాలుకుమార్‌ను పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు అభినందించారు. రాజేంద్రకుమార్, సుకుమార్, రజినీ, ఆంజనేయులు, శారద, జైసింగ్ పాల్గొన్నారు.

పీఎం జీవన్‌జ్యోతి పాలసీ బీమా అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన తాళ్లపెల్లి రాజేందర్ అనే ఘన్‌పూర్ ఎస్‌బీఐ ఖాతాదారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, అతని నామినీ అయిన భార్య ఉషశ్రీకి ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం జీవన్‌జ్యోతి పాలసీ బీమా రూ.2లక్షల సెటిల్‌మెంట్ కాపీని అందించారు. ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ స్వామి, అసిస్టెంట్ మేనేజర్ శైలజ, ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకుడు దారం రాజు పాల్గొన్నారు.

కొడుకుకు తలకొరివి పెట్టిన తల్లి



బచ్చన్నపేట: వృద్ధాప్యంలో తోడుగా ఉంటాడనుకున్న కుమారుడు మృతి చెందగా ఆ తల్లే కొరివి పెట్టిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన సూబ్బూరు లక్ష్మికి ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు వెంకటేష్ (39) పుట్టుకతోనే అంగవైకల్యంతో ఉన్నాడు. ట్రైసైకిల్‌పై మాత్రమే తిరిగే వాడు. అనారోగ్యంతో మృతి చెందగా తల్లి లక్ష్మి కుమారుడికి కొరివి పెట్టి అంత్యక్రియలను నిర్వహించింది.

రిమాండ్

బచ్చన్నపేట: ఇటుకాలపల్లిలో భూ తగాదా విషయంలో కాస సిద్దులు, పర్శరాములుపై దాడికి పాల్పడిన వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. భూ తగాదా విషయంలో కాస సిద్దులు, పర్శరాములుపై దాడికి పాల్పడిన బియ్య స్వామి, బియ్య పద్మ, బియ్య అయిలయ్య, కాస చిన్న అయిలయ్యలను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. భూ తగాదా విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



వెంకటనర్సు (ఫైల్)

చిల్పూరు: ఈనెల 23న గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, కుటుంబ సభ్యులు మంగళవారం గుర్తించారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లికి చెందిన వెంకటనర్సు(65) ఈనెల 23న చిన్నపెండ్యాలలో ఓ విందుకు డీసీఎం వ్యాన్‌లో వెళ్లాడు. సాయంత్రం గ్రామానికి వచ్చేటప్పుడు డీసీఎం ఎక్కకుండా కాలినడకన ఇంటికి బయలుదేరాడు. రాజవరం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వినయ్‌కుమార్ చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఆరు రోజులైనా విందుకు వెళ్లిన తన భర్త వెంకటనర్సు కనిపించడం లేదంటూ భార్య యాదమ్మ మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. మృతుడి ఫొటోను కుటుంబ సభ్యులకు చూపించగా తన భర్తేనంటూ తెలిపింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

జనగామ రూరల్: సెయింట్ మేరీస్ పాఠశాలలో..



కొడకండ్ల: గిర్నితండా పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ జ్యోతి



జఫర్‌గఢ్ తిమ్మంపేట పాఠశాలలో ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పాలకుర్తి టౌన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎగ్జిబిట్ తిలకిస్తున్న సర్పంచ్ యాకాంతారావు



ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించగా ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలపై ఆసక్తి, అవగాహనను పెంచుకోవాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అదనపు జూనియర్ జడ్జి సీహెచ్ నర్మద, ఏకశిల బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం మర్రెడ్డి, ఏబీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నర్సయ్య, నోడల్ విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ రూరల్: శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు జూనియర్ జడ్జి నర్మద



దేవరుప్పుల: శ్రీసాయిప్రశాంతి విద్యానికేతన్‌లో..



ఏబీవీ డిగ్రీ కళాశాలలో..



నర్మెట: వెల్దండ గుడ్‌షెఫర్డ్ స్కూల్‌లో..



జనగామ రూరల్: గానుగుపహాడ్ పాఠశాలలో..



తరిగొప్పులలో..

పన్నులు వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ

బచ్చన్నపేట: గ్రామాల్లో ఇంటి, నల్లా పన్నులను గ్రామస్తుల నుంచి వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఆయన పల్లె ప్రగతి పనులను పరిశీలించి జీపీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నర్సరీలో మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పడుతూ వాటిని రక్షించాలని అన్నారు. గ్రామ సర్పంచ్ తాతిరెడ్డి భవాని, పంచాయితీ కార్యదర్శి రాధాకృష్ణ, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు సాధించే వరకూ పోరాటం

జనగామ రూరల్: ఇందిరమ్మ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని 16 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇళ్లు సాధించే వరకూ పోరాటం చేస్తామని లబ్ధిదారుల సాధన సంఘం సహాయ కార్యదర్శి చిర్ర రజిత అన్నారు. మంగళవారం ఐలమ్మ నగర్‌లో చేపడుతున్న నిరాహార దీక్షలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. మహిళలు, ఎండీ గౌస్య, మంద అనిత, తాతూరు భాగ్య లక్ష్మి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి'

రఘునాథపల్లి: కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగొండలో జరిగిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గ్రామ పంచాయతీలకు నేరుగా 42 శాతం నిధులు ఇస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేష్‌యాదవ్, నాయకులు యాదగిరి, మహేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తరిగొప్పుల: పల్లెల్లో ప్రతీ ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఏర్పడిందని పార్లమెంట్ కోకన్వీనర్ కొంతం శ్రీనివాస్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని వాచ్యతండాలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతం శ్రీనివాస్ మాట్లాడారు. బండ ప్రసాద్, ఏదెల్లి రాంనర్సింహారెడ్డి, ఎర్రవెల్లి ప్రతాప్, కొన్నె రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పీఎం కిసాన్ డబ్బులను రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్నారని బీజేపీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఉమ్మెంతల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ డబ్బులు ఒక్కొక్క రైతుకు రూ. 2వేల చొప్పున రూ.16వేల కోట్లను రైతుల ఖాతాల్లో దేశ వ్యాప్తంగా జమ చేశారని తెలిపారు. పీఎం కిసాన్ డబ్బులు రాని రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకొని ఖచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా 'బబ్బూరి'



దేవరుప్పుల: సామాజిక సేవతో పాటు బడుగు బలహీన వర్గాల పేదలకు యువ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందిస్తున్నాడు. మంగళవారం పెద్దమడూరు గ్రామానికి చెందిన గనుపాక అంజయ్య–సుజాతల కుమార్తె సౌమ్య వివాహ భోజన ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు అందజేసి దాతృత్వాన్ని చాటుకొన్నాడు. బబ్బూరి యాదగిరిగౌడ్, నాగరాజు, శ్రీనివాస్, ఉమేష్, శేఖర్, చంద్రగిరి ఉన్నారు.

ఘనంగా టైలర్స్‌డే వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ సంపత్



మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి

జనగామ రూరల్/ దేవరుప్పుల/బచ్చన్నపేట/ పాలకుర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా టైలర్స్ డే వేడుకలను మేర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టు మిషన్‌ను కనిపెట్టిన ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలో జిల్లా మేర సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ తాళ్ల సంపత్ హాజరై జెండాను ఆవిష్కరించారు. ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

వివక్షపై ఫిర్యాదులు చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ అంజయ్య

లింగాలఘణపురం: సమాజంలో నేడు అందరూ సమానమనే భావనతో కాకుండా వివక్ష ఉంటే ఫిర్యాదు చేయొచ్చని తహసీల్దార్ అంజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సర్పంచ్ విజయ్‌మనోహర్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కులమత వివక్ష లేని సమాజం కోసం నేడు ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకొచ్చిందని, ఎక్కడైనా ఏదైన అంటరానితనంపై వివక్ష ఉంటే ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎస్సై ప్రవీణ్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ భిక్షపతి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



కొడకండ్ల: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

తరిగొప్పుల: గిరిజన మెడికో విద్యార్థిని ప్రీతిని మానసికంగా హింసించిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ముడావత్ సంపత్‌నాయక్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి సీనియర్ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందని, ప్రభుత్వ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గిరిజన నాయకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కొడకండ్ల: గిరిజన పీజీ వైద్య విద్యార్థి ప్రీతి మృతికి సంతాపంగా మంగళవారం రాత్రి ఆమె స్వగ్రామమైన గిర్నితండలో తెలంగాణ గిరిజన విద్యార్థి సేవాసంఘ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీని నిర్వహించారు. ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరి తీయాలని, బాధ్యులైన హెచ్‌వోడీ, ప్రిన్సిపాల్‌లపై కఠిన చర్యలు తీసుకొవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. ప్రీతి తల్లిదండ్రులు నరేందర్, శారద, ఎంపీపీ జ్యోతి, సర్పంచ్‌లు రాజ్‌కుమార్, మహేష్‌నాయక్‌లు, టీజీవీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

జనగామ రూరల్: మెడికో ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని గిరిజన, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాయకులు చందు, రాజేందర్, లాల్కా, కాల్‌రామ్, సందీప్, సురేష్, అహల్య, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రీతికి నివాళులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో సేవాలాల్ సేన మండల కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రీతినాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అనిల్‌చౌహాన్ నాయకులు వెంకటేష్, సృజన్,మహేందర్, నవీన్ పాల్గొన్నారు.

మహిళల నిరసన..

జఫర్‌గఢ్: మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి శభాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో తమ్మడపల్లి (జి) మహిళా సంఘం నేతలు, మహిళలు నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గుండెబోయిన రోజా, చినూరి వెంకటమ్మ, చిలువేరు అనిత, రేణుక, సంధ్య, యాదమ్మ పాల్గొన్నారు.

మందుల పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

రఘునాథపల్లి: పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు వాడే మందుల పిచికారీలో రైతులు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఈఓ రిషిత అన్నారు. మంగళవారం మండలంలోని కోడూర్ రైతు వేదికలో ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పకుండా మాస్కు, చేతులకు గ్లౌస్ ధరించాలని సూచించారు. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సంస్థ సేల్స్ ట్రేయినీ నాగరాజు, సర్పంచ్ కరుణాకర్ రైతులు పాల్గొన్నారు.

బీజేపీని రాజకీయంగా సమాధి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మాదిగలను మోసం చేస్తున్న బీజేపీని రానున్న రోజుల్లో రాజకీయంగా సమాధి చేయాలని ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నర్సయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడ ఏలియా అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ హామీలను విస్మరించిందన్నారు. సమావేశంలో నలిమెల నాగరాజు, శ్రీనివాస్, ఆదాం, హరికృష్ణ, శ్రీధర్, గోవిందు ఇసాక్, నవీన్, జీవన్, మహేందర్, స్వామి పాల్గొన్నారు.

అభినందనీయం



ఉత్సవ మూర్తుల విగ్రహాలను అందజేస్తున్న దాతలు

చిల్పూరు: రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి దాతలుగా ముందుకు రావడం అభినందనీయమని ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు నారగోని రాజు, సట్ల లింగయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం గ్రామానికి చెందిన భోనగిరి రాములు–రాజమణి, శివరాత్రి రాజు–మంజుల దంపతులు రూ. 20 వేల విలువైన ఇత్తడి పంచలోహంతో తయారు చేసిన ఉత్సవ మూర్తులు పరుశరాములు, మునిరాజు విగ్రహాలను అందజేశారు. రవిచంద్ర, రాజు, ప్రవీన్, రాజు, వెంకన్న, కుమార్, రాజ్‌కుమార్, రాములు, సునీల్, సాంబశివరాఊ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

జనగామ రూరల్: తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లే దారిలో ట్రాక్టర్ వెళ్తుండడంతో గుంతలు ఏర్పడ్డాయి.. వాటిని పూడ్చాలని ట్రాక్టర్ యజమానికి తెలుపడంతో అతనిపై పలువురు దాడి చేశారు. ఈ ఘటన యశ్వాంతాపూర్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యశ్వాంతాపూర్ గ్రామానికి చెందిన కామిని శ్రీనివాస్ వ్యవసాయ బావి పక్కన ట్రాక్టర్ ద్వారా మట్టితోడి తీసుకెళ్తుండటంతో దారి గుంతలమయంగా మరింది. దీంతో శ్రీనివాస్ గుంతలు పూడ్చాలని ట్రాక్టర్ ఓనర్ దొంగోని మల్లయ్య, కుమారుడు రమేష్‌కు తెలుపడంతో ఇరువురికి గొడవ జరిగింది. దానిని మనుసులో పెట్టుకొని సోమవారం రాత్రి 10 గంటల సమయంలో శ్రీనివాస్ ఇంటికి వచ్చి దాడి చేయగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా యశ్వాంతాపూర్ వాగు వద్దకు సీఐ శ్రీనివాస్ యాదవ్ వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై జీనత్ తెలిపారు.

చినజీయర్ స్వామికి ఘన స్వాగతం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో త్రిదండి చిన జీయర్ స్వామికి మంగళవారం సాయంత్రం రాజీవ్ చౌరస్తాలో ఘనస్వాగతం పలికారు. రాయపర్తి మండలం తిరుమలాయపల్లిలో దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు వెళ్తున్న ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, ఎంపీపీ నాగిరెడ్డి, సర్పంచ్ యాకాంతారావు ఉన్నారు.

సంపన్నులకు పన్ను రాయితీ రద్దు చేయాలి

జనగామ రూరల్: సంపన్నులకు పన్ను రాయితీ రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడారు. నాయకులు ఉపేందర్, విజేందర్, మిట్యా నాయక్, లింగం, సందీప్, మల్లేష్, సురేష్, శివ, మునీర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

చిల్పూరు: గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని సర్పంచ్ పుట్ట అంజనీరవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెం 8వ వార్డులో మంగళవారం రూ. 5 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్‌తో కలిసి ఎంపీటీసీ సాదం నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మరిన్ని సమస్యలు ఉన్నాయని సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

మన ఊరు–మన బడి పనుల పరిశీలన

దేవరుప్పుల: మన ఊరు–మన బడి పథకంలో భాగంగా మండలంలోని మాధాపురం పాఠశాల సుందరీకరణ పనులను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. 2న మంత్రి దయాకర్‌రావు ప్రారంభోత్సవ కార్యక్రమ నేపథ్యంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్‌గౌడ్, సర్పంచ్ శ్రీధర్, పల్లా సుందర్ రామిరెడ్డి పనులను పరిశీలించారు. అనంతరం పెద్దమడూరులో నాగిళ్ల లాలమ్మ మృతి చెందగా పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

సంక్షిప్తంగా

నిధులు మంజూరు చేయండి



చిల్పూరు: మల్కాపూర్ గ్రామాభివద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంగళవారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గ్రామ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ పోలేపల్లి రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

బోసు రాజుతో ఇందిర భేటీ

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్ గాంధీభవన్‌లో ఏఐసీసీ సెక్రటరీ ఇన్‌చార్జ్ బోసు రాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌తో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర మంగళవారం భేటీ అయ్యారు. గాంధీభవన్‌లో టీపీసీసీ జనరల్ సెక్రటరీల సమావేశంలో పాల్గొన్న ఇందిర అనంతరం వారితో భేటీ అయి నియోజకవర్గంలోని పరిస్థితులను వివరించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, బీఆర్‌ఎస్ పార్టీ వైఫల్యాలు, కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేలా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై వారితో ఆమె చర్చించారు.

గ్రంథాలయాలు విద్యార్థుల మేథస్సును పెంపొందిస్తాయి

పాలకుర్తి: గ్రంథాలయాలు విద్యార్థుల మేథస్సును పెంపొందిచేందుకు ఎంతో ఉపయోడపతయాని రైతు బంధు సమితి జిల్లా డైరెక్టర్ ఎర్రబెల్లి రాఘవరావు అన్నారు. మంగళవారం మండలంలోని విస్నూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి ప్రభుత్వం అందించిన 250 పుస్తకాలను రాఘవరావు అందజేశారు.

100 మంది విద్యార్థులకు అతిథి భోజనం

విస్నూరు ప్రాథమిక పాఠశాల ఇంగ్లిష్ మీడియం 3వ తరగతి చదువుతున్న బాలగాని హర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా తండ్రి పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ నాగరాజు అతిథి భోజనం ఏర్పాటు చేశారు.

నట్టల నివారణ మందు వేయించాలి

జనగామ రూరల్: జీవాలకు వ్యాధులు సోకకుండా నట్టల నివారణ మందు వేయించాలని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. మంగళవారం శామీర్‌పేటలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువైద్యాధికారి సతీష్, సర్పంచ్ స్వరూప పాల్గొన్నారు.

పరామర్శ

రఘునాథపల్లి: జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బైరగోని రాజుగౌడ్ ఇటీవల తాటిచెట్టుపైనుంచి పడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. కాగా, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు మంగళవారం రాజుగౌడ్‌ను పరామర్శించారు. వెంకటమల్లయ్య గౌడ్, కుర్ర సత్తయ్య తదితరులు ఉన్నారు.

శ్రీచైతన్య టెక్నో స్కూల్‌ను రద్దు చేయాలి

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు ప్రభుత్వ అనుమతులు లేవని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య కు వినతి పత్రం అందజేశారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



చిల్పూరు: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని పెద్ది వసంత మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి, హైదరాబాద్‌కు చెందిన సేల్స్ ఫోర్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్ మేనేజర్ పెద్ది నవీన్ గౌడ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రూ. 20వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి.సత్యం (S.R) : 8008671692 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191